జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 59 | ఆదివారం 20 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ప్రభుత్వానికి అందిన కుల గణన సర్వే నివేదిక..



(సందేశం టైమ్స్, జులై 19) : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే - 2024 పై ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ తమ అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సర్వే పూర్తి శాస్త్రీయంగా, విశ్వసనీయంగా కొనసాగించబడిందని కమిటీ అభిప్రాయపడింది. దేశానికి రోల్ మోడల్ గా నిలిచే సర్వేగా ఇది చారిత్రాత్మకంగా నిలుస్తుందని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది.

**ముఖ్యమంత్రి చేతికి 300 పేజీల నివేదిక**

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్ఆర్డీ) లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ సభ్యులు 300 పేజీల నివేదికను అందజేసింది.

**మంత్రివర్గంలో చర్చించి తదుపరి నిర్ణయాలు..**

నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని సూచనలను మంత్రివర్గంలో చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి ఈ సర్వే దోహదం చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పట్టణ, గ్రామీణ వ్యత్యాసాలు, వాటి కారణాలను విశ్లేషించి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు.

అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల అవసరాలను గుర్తించి సరైన సూచనలు ఇవ్వాలని కమిటీని కోరారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**నిపుణుల కమిటీ సభ్యులు**

వర్కింగ్ గ్రూప్ ఛైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డితో పాటు వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచె అయిలయ్య, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డా. సుఖదేవ్ తొరాట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ జీన్ డ్రెజ్, ప్రొఫెసర్ థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

## ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ..

### ఆర్థిక వృద్ధి, పర్యావరణ పరిరక్షణపై చర్చ..

### డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన సమావేశం



(సందేశం టైమ్స్, జులై 19) : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్-కమిట సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఆర్థిక వృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ముఖ్య అంశాలపై చర్చించారు.

**కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యత**

హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ తరలింపునకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు, కాలపట్టికను తక్షణమే రూపొందించాలని సూచించారు. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం, ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశ్యం అని భట్టి అన్నారు.

**సామాన్యులకు అందుబాటులో గృహాలు**

హౌసింగ్ బోర్డు నిర్మించే ఇళ్ల అమ్మకం సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరాన్ని సమావేశంలో చర్చించారు. గృహ నిర్మాణ రంగంలో పారదర్శకతను పెంచడానికి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

**ఆదాయ వనరుల సమీకరణపై సమీక్ష**

రాష్ట్ర ఆదాయ వనరులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా కమర్షియల్ టాక్స్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్, గనుల శాఖల ద్వారా వచ్చే ఆదాయాల్లో నమోదైన వృద్ధిని విశ్లేషించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చడానికి ఈ శాఖల ఆదాయాన్ని మరింత పెంచే మార్గాలపై చర్చించారు.

ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పలు కీలక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక పురోగతికి, ప్రజల సంక్షేమానికి అవసరమైన చర్యలపై ఈ సమావేశం ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసింది.

## కొత్త టెక్నాలజీతో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణ

### ఏడాది వ్యవధిలో 4.8 కిలోమీటర్లు తవ్వాలి
### జలాశయాల నుంచి ఆయకట్టుకు నీళ్లివ్వాలి
### రెండు నెలల్లోపు పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలి: ఉత్తమ్



హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 19) : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. జాతీయ భౌగోళిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎసఐ)ల సహకారంతో 10 కిలోమీటర్ల సొరంగ మార్గం పనులను సత్వరంగా పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నియమించుకున్న ఆర్మీ మాజీ అధికారులు జనరల్ హర్పాల్‌సింగ్, కల్నల్ పరిక్షిత్ మెహ్రాల సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. శనివారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ పనులకు అసవరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఏడాది వ్యవధిలో 4.8 కిలోమీటర్ల మేర తవ్వం పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో అవాంతరాలు ఎదురుకాకుండా ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తల సహకారంతో ఏరియల్ లైడార్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జలాశయాల్లో నీటి నిల్వల ఆధారంగా ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు సాగు నీరందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఈల నుంచి ఈఎన్సీల వరకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. నిర్దిష్ట వ్యవధిలోగా పదోన్నతుల ప్రక్రియ పూర్తికావాలని ఆయన అన్నారు.

## డీఎంఈ నరేంద్రకుమార్‌కు ప్రతిష్ఠాత్మక ఓరేషన్ అవార్డు



### చిన్నారుల థొరాసిస్ సర్జరీ సేవలకు గుర్తింపు
### వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర అభినందనలు

హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 19) : పిడియాట్రిక్ థొరాసిక్ సర్జరీ విభాగంలో చేసిన విశేష కృషికి తెలంగాణ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఏ.నరేంద్ర కుమార్‌ను జాతీయ అవార్డు వరించింది. చిన్న పిల్లలకు వైద్య సేవలు, ముఖ్యంగా సర్జరీల్లో అందించిన సేవలకు ఇండియన్ పిడియాట్రిక్ అసోసియేషన్ ప్రతిష్టాత్మక 'ఓరేషన్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పిడియాట్రిక్స్ సర్జన్ (ఐఏపీఎస్)లో భాగమైన ది సొసైటీ ఆఫ్ పిడియాట్రిక్ థొరాసిస్ సర్జరీ (ఎస్‌పీటీఎస్), మధ్యప్రదేశ్–చత్తీస్‌గఢ్ చాప్టర్ ఆఫ్ పిడియాట్రిక్ సర్జన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండోర్‌లో తొలిసారి జరిగిన ఎస్‌పీటీఎస్–2025 జాతీయ సదస్సుకు దేశవ్యాప్తంగా 150 మంది సీనియర్ పిడియాట్రిక్ సర్జన్లు హాజరయ్యారు. ఈ సదస్సులో డాక్టర్ నరేంద్ర కుమార్‌కు ఓరేషన్ అవార్డు ప్రదానం చేశారు. ఓరేషన్ అవార్డు అందుకున్న నరేంద్ర కుమార్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. దేశంలో పిడియాట్రిక్ థొరాసిస్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించిన నరేంద్ర కుమార్ కృషితో.. ఇందులో దేశవ్యాప్తంగా ఎంతో మంది నిపుణులుగా ఎదిగారని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పిడియాట్రిక్స్ కొనియాడింది. 25 ఏళ్లుగా అత్యంత స్వల్ప గాట్లతోనే ఎంతో మంది పిల్లలకు శస్త్రచికిత్స చేసి, వారి ప్రాణాలు కాపాడారని ప్రశంసించింది. పిడియాట్రిక్ థొరాసిస్ సర్జరీలో మంచి పేరు సంపాదించుకున్న డాక్టర్ నరేంద్ర కుమార్ 22 వ్యాసాలు ప్రచురించారు.

## మెట్రో రెండో దశ కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచండి



హైదరాబాద్, (సందేశం టైమ్స్, జులై 19) : హైదరాబాద్ మెట్రో రెండో దశ సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పార్లమెంటు సభ్యులను తెలంగాణ ప్రభుత్వం కోరింది. శనివారం హైదరాబాద్‌లో ఎంపీలతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావుతోపాటు మెట్రో రైలు ఎండీ ఎన్వీఎసరెడ్డి హాజరయ్యారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ నినాదంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వానికి హైదరాబాద్ వంటి మహా నగరాలు ఎంతో కీలకమని మల్లు భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి చెప్పారు. పెట్టుబడులకు, పరిశ్రమలకు, ఉపాధికి స్వర్గధామం వంటి హైదరాబాద్‌కు మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టును మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు.

# వ్యర్థాలతో ఎనర్జీ .. సద్వినియోగం చేసుకోవాలన్న చంద్రబాబు

తిరుపతి, (సందేశం టైమ్స్, జులై 19) :తిరుపతిలో ఇంత మంచి వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ ఉందనే విషయం మీరు నాకు చెప్పలేదు. నేను కూడా మరిచిపోయాను. ఇటువంటి ప్లాంట్ ఉపయోగించుకుని రాష్ట్రంలో ఫంక్షనల్ సర్క్యులర్ ఎకానమీ సెంటర్ ఏర్పాటు చేయవచ్చు అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన శనివారం మధ్యాహ్నం రేణిగుంట సమీపంలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహించే తూకివాకం ప్రాంతంలో దాదాపు 300 ఎకరాల విస్తీర్ణం లోని డ్రై వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్( ప్లాట్ ను ), బయో మిథనైజేషన్ గ్యాస్ ప్లాంట్, భవన నిర్వహణ వ్యర్థాల తదితర యూనిట్లను పరిశీలించారు. దాదాపు అరగంట కు పైగా ఆ ప్లాంట్ ల పనితీరును పరిశీలించిన చంద్రబాబు సంబంధిత వివరాలను, భవిష్యత్ ప్రణాళికలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు డ్రై వేస్ట్ విక్రయాల ద్వారా, మీథేన్ గ్యాస్ విక్రయాల ద్వారా వస్తున్న ఆదాయాన్ని గురించి తెలుసుకున్నారు. ఇక్కడి ప్లాంట్ నుంచి 22 టన్నుల ఆర్గానిక్ వేస్ట్ నుంచి 750 కేజీ ల బయో గ్యాస్ ఉత్పత్తి అవుతోందని, ఆ గ్యాస్ ను హోటళ్ల కు కేజీ రూ 76 కు విక్రయిస్తున్నామని అధికారులు వివరించారు.ఇక్కడి ప్లాంట్ లో రీ సైకిల్ చేస్తున్న వ్యర్థ జలాలను తాగ దానికి కూడా వినియోగిస్తున్న సింగపూర్ మోడల్ తరహా ప్రయత్నాలు చేయాలని నిర్దేశించారు. తిరిగి వెళ్ళేటప్పుడు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తో మాట్లాడుతూ వైజాగ్ లో ఇటువంటి ప్లాంట్ ఉందని తెలుసు కానీ తిరుపతి లో ఇంత మంచి మోడల్ నా దృష్టికి తీసుకురాలేదు అన్నారు ఇదంతా 2016. 2017 మధ్యకాలంలో తిరుపతి స్మార్ట్ సిటీ పనుల కింద చేపట్టింది అని చెప్పగా మీరు చెప్పలేదు నేను కూడా మరిచిపోయాను అని అన్నారు. ఇటువంటి ప్లాంట్ లను పెద్ద ఆదాయ వనరులుగా ఉపయోగించుకోవచ్చునని అంటూ ముఖ్యంగా బయో గ్యాస్ ను కొనుక్కునే హోటళ్ల వంటి సముదాయాల నుంచి వెజిటబుల్ వెస్ట్ తీసుకుని, వారికి గ్యాస్ ఇచ్చేవిధంగా బై బ్యాక్ విధానంలో లబ్ది పొందవచ్చునని అన్నారు. ప్లాంట్ కు తగినంత వేస్ట్ కావాలంటే 40 %-% 50 కిలోమీటర్ల పరిధి నుంచి సేకరించే ఏర్పాట్లు చేయాలని



సూచించారు. ఇటువంటి వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ ల ద్వారా రాష్ట్రంలో ఫంక్షనల్ సర్క్యులర్ ఎకానమీ సెంటర్ ని ఏర్పాటు చేయవచ్చినని, ఆ కోణంలో ఆలోచన చేయాలని మంత్రి నారాయణకు ఇతర అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణతో పాటు శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, మునిసిపల్ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు

# గోవా గవర్నర్ అశోక్ కు మంత్రి అనిత అభినందనలు



విజయనగరం,(సందేశం టైమ్స్, జులై 19) : గోవా రాష్ట్ర గవర్నర్ గా నియమితులైన మాన్సాస్ చైర్మన్, మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు కి రాష్ట్ర హోం అండ్ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎం ఎస్ ఎం ఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాన్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు కోళ్ల లలిత కుమారి, పూసపాటి అతిధి గజపతిరాజు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

నంద్యాల (సందేశం టైమ్స్, జులై 19) : జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం లో వెలిసిన శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల దర్శనార్థం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వై.లక్ష్మినారాయణ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్ల దర్శనార్థమై ఉదయం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు అర్చక వేదపండితులు ఆలయ సంప్రదాయంలో భాగంగా స్వాగతం పలికారు.వీరు భ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారికి విశేష రుద్రాభిషేకం చేపట్టారు. శ్రీ భ్రమరాంబదేవికి విశేష కుంకుమార్చనాదివిశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం



ఆలయ సంప్రదాయంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనాలు వల్లించారు. కార్యనిర్వహణాధికారి స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, స్వామివార్ల జ్ఞాపిక, ప్రసాదములనిచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# ఐటిసి గోడౌన్ లో అగ్ని ప్రమాదం – వంద కోట్ల విలువైన ప్రొడక్ట్స్ బూడిద



(సందేశం టైమ్స్, జులై 19) : విశాఖపట్నం శివార్లలోని ఐటీసీ గోదాంలో గత అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గండిగుండం దగ్గర జాతీయ రహదారిని అనుకుని వున్న ఫుడ్ ప్రొడక్ట్స్ గోడౌన్ మొత్తం కాలి బూడిదైంది. మంటల తీవ్రతకు గోడౌన్ ఇనుప గడ్డర్లు మెల్ట్ అయిపోయి కూలిపోయాయి. విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి డిజాస్టర్, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. సెంట్ బాటిల్స్, పినాయిల్స్ లాంటివి ఉండటంతో మంటలను అదుపు చేయడం ఫైర్ సిబ్బందికి కష్టంగా మారింది.ఐటీసీ ఉత్పత్తులు అయినా ఫుడ్, సిగరెట్లు స్టాక్స్ నిల్వలు ఇందులో ఉన్నాయి. పూర్తిగా అగ్నికి ఆహుతైన ఈ గోదాములో రోజూ 300 మంది కార్మికులు పని చేస్తుంటారు. ప్రమాద సమయంలో సెక్యూరిటీ సిబ్బంది మినహా మిగిలిన కార్మికులు ఎవరు గోదాంలో లేరు.

వంద కోట్ల విలువైన ప్రొడక్ట్స్ బూడిద


అయితే, ఐటీసీ గోడౌన్ అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 100 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి ప్రొడక్ట్స్ నేరుగా ఇక్కడకు తరలిస్తుంటారు. ఇక్కడి నుంచి ఒడిశా నుంచి తూర్పు గోదావరి జిల్లా వరకు పంపిణీ చేస్తుంటారు. ఈ స్థాయిలో స్టాక్ ఉన్న చోట్ల భారీ అగ్నిప్రమాదం జరగడం వెనుక కారణాలపై విచారణ కొనసాగుతుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు. అర్ధరాత్రి మంటలు వ్యాపించగా 9 ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఇస్రో సేవలు




తిరుమల, (సందేశం టైమ్స్, జులై 19) : ఇస్రో సేవలను టీటీడీ వినియోగించుకోనుంది. అందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. దేశంలో ప్రముఖ పుణ్య క్షేత్రం తిరుమల. అక్కడ కొలువైన శ్రీవారిని ప్రతీరోజు వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. టికెట్ల పంపణీ నంచి అన్ని రకాలైన సేవలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేస్తారు. అయితే వాహన సేవల్లో పాల్గొనే భక్తుల సంఖ్యలను టీటీడీ లెక్కిస్తుంది. అందుకుగాను కచ్చితమైన సంఖ్యను తెలుసుకోవడానికి టీటీడీ అధికారులు ఇస్రోను రంగంలోకి దించుతున్నారు.తిరుమలలో అన్ని సేవల్లో గరుడ వాహన సేవ అంటే చాలా ప్రసిద్ధి. గరుడవాహన సేవలను తిలకించడానికి భక్తులు తిరుమలలో కిక్కిరిసిపోతారు. కాగా.. సెప్టెంబర్ 24న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే గురుడోత్సవం రోజున మాడవీధుల్లో ఎంత మంది భక్తులు దర్శించుకుంటారనే అవకాశం ఉందన్నది ఇస్రో ద్వారా టీటీడీ తెలుసుకోనుంది. అందుకుగాను శాటిలైట్ ద్వారా గుర్తించనున్నారు. సమాచారాన్ని తెలుసుకు నేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. తద్వారా ఏర్పాట్లు చేయనున్నారు.

# లోకేష్-ఆనంద్ మహీంద్రా మధ్య ఆసక్తికర సంభాషణ

ఇంటర్నెట్ డెస్క్: (సందేశం టైమ్స్, జులై 19) : ఏపీ మంత్రి నారా లోకేష్ – మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా మధ్య సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆసక్తికర సంభాషణ జరిగింది. మహీంద్రా కంపెనీ నుంచి కొత్తగా ఫ్యూరియో-8 ట్రక్కులు మార్కెట్లోకి విడుదలైన సందర్భంగా ఆనంద్ మహీంద్రా ఒక ట్వీట్ చేశారు. సాధారణంగా సోషల్ మీడియాలో ఆనంద్ మహీంద్రా ట్వీట్స్ కు మంచి ఆదరణ ఉంటుందన్న సంగతి నెటిజన్లకు తెలిసిందే. అయితే, ఈ సారి ఆనంద్ మహీంద్రా తన సందేశాన్ని తెలుగులో రాశారు. ఆయన ఏమన్నారంటే.. 'ఒక్క నిర్ణయం చాలు... మీ విధి మీ చేతుల్లో ఉంది. ట్రక్ మార్చండి. మీ విధిని వశం చేసుకోండి.' అని రాసి సదరు కొత్త తరహా ట్రక్ గురించిన వీడియో పెట్టారు.సదరు పోస్టుపై ఏపీ మంత్రి నారా లోకేష్ స్పందించారు. 'తెలుగు ప్రకటన చాలా నచ్చింది సార్. మీ వాహనాలకు ఏపీ పెద్ద మార్కెట్. అంతేకాదు, ఈ యాడ్ తప్పకుండా అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను. అధునాతన ఆటోమోటివ్ వ్యవస్థ పర్యావరణాన్ని కాపాడటానికి, పెద్ద మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవడానికి వీలుకల్పిస్తుంది.

# జహిరాబాద్ లో దేశ మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటుకు వినతి పత్రం అందజేత


**జహీరాబాద్**

**పార్లమెంట్ సభ్యులు**

**సురేశ్ కుమార్ షెట్కార్**

**ఎ. చంద్రశేఖర్**

**మాజీ మంత్రి**




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి 19జులై సంగారెడ్డి జిల్లా జహిరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా వారి బృంధం అంతా కలిసి 19-07-2025 తేదీన యం.పి క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.అస్మా మట్లాడుతు శ్రీ రాజీవ్ గాంధీ పాలనలో తీసుకున్న నిర్ణయాలు దేశంలో సాంకేతిక, టెలికాం రంగానికి బలమైన పునాదులు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రజలు మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తూ ఈరోజు ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారంటే దానికి శ్రీ రాజీవ్ గాంధీ పాలన సంస్కరణల ఫలితమే అన్నారు.దేశానికి శ్రీ రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం. దేశ యువతకు ఆయన ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు.దే శ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఆదర్శ నాయకుడి విగ్రహం జహీరాబాద్ పరిసరాల్లో లేకపోవడం లోటుగా కనిపించిందని, ఆ లోటును తీర్చడానికి శ్రీ రాజీవ్ గాంధి విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమం లో మమత, వహీదా బేగం, తుల్జమ్మ, చెన్ను బేగం, అనీస్ బేగం, మారునీ బాయి, సీతా బాయి, సుమిత్ర, పుణ్యమ్మ, అహ్మదీ బేగం తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## మతరాజ్య భావన ఒక మానసిక దౌర్బల్యం

భావజాల మార్పుతోనే హిందూరాజ్య స్థాపన' శీర్షికతో జూల్కై 11న దోర్బల బాలశేఖరశర్మ రాసిన అంశాలు దేశంలో విద్వేష ప్రచారానికి జనాలు ఎంతగా లోన్కెందీ వెల్లడిస్తున్నాయి. గత చరిత్రను చూసినపుడు భారత ఉపఖండంలో వివిధ మతాలను అవలంబించిన రాజులు ఉన్నారు తప్ప మత రాజ్యాలు ఉన్నట్లు చరిత్ర లేదు. కొన్ని దేశాల్లో ఉన్న ఇస్లామిక్, క్రైస్తవ, బౌద్ధ మతాలను అధికారికంగా ప్రకటించటాన్ని చూసి భారత్‌లో హిందూ రాజ్య స్థాపన చేయాలని కొందరు విదేశీ భావజాలాన్ని కాపీకొట్టి (ఆర్ఎస్ఎస్ వారు వేసుకొన్న నిక్కర్లు, ఇప్పటి పాంట్లు కూడా విదేశీ కాపీ తప్ప మన వస్త్రధారణ కాదు), గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే 101వ సారి నిజంగా మారుతుందట. హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు ఎవరైనా తమ మత రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారంటే దురహంకారవాదపు ప్రతికూల ప్రభావంతో తలెత్తే ఒక మానసిక దౌర్బల్యానికి చిహ్నం తప్ప మరొకటి కాదు. అది మతానికే పరిమితం కాదు, చివరకు కులాల రాజ్యాలు ఏర్పాటు జరగాలన్న దిగజారుడుకూ దారితీస్తుంది.సోషలిజం అన్నది భారతీయ ఆర్థిక ఆలోచన కాదని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ వాదించినట్లు రచయిత పేర్కొన్నారు. ఇదొక అర్థం లేని వాదన. ఒక్కో దేశానికి ఒక్కో ఆర్థిక ఆలోచన ఉండదు. ప్రపంచమంతా ఒక కుగ్రామం అని చెబుతున్న రోజుల్లో ఇలాంటి కబుర్లు చెప్పటం జనాలను మభ్యపెట్టే అతితెలివి తప్ప మరొకటి కాదు. పొలంలో పని చేసేవాడు ఎక్కడ్కెనా వ్యవసాయ కార్మికుడే, అలాగే అమెరికాలో అయినా అనకాపల్లిలో అయినా ఫ్యాక్టరీ పనివాడు పారిశ్రామిక కార్మికుడే. పెట్టుబడి, లాభాలు తప్ప మరొక గీటురాయి ఉండదు. సోషలిజం కూడా అలాంటిదే. భారతదేశం ఎల్లపుడూ సర్వోదయ, అంత్యోదయ సూత్రాలను అవలంబించిందని కూడా అసోం సీఎం చెప్పారట. సర్వేజనా సుఖినో భవంతు అని సోషలిస్టు భావన కంటే ముందే చెప్పారు. అయినా దానిలో అందరికీ మంచి జరిగితే అంత్యోదయ, అత్యల్ప వర్గాలు ఎందుకున్నట్లు! బ్రిటిష్ వారి హయాంలో కూడా లేని ఆర్థిక అంతరాలు ఎందుకు పెరుగుతున్నట్లు! లౌకికవాదం దారి తప్పిందట, దాని వలన హిందూ ధర్మానికీ, సమాజానికీ హాని కలుగుతున్నందున దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించటం గురించి ఆలోచించాలట. లౌకికవాదం దారితప్పితే గాడిలో పెట్టమని అడగాల్సింది పోయి మతరాజ్యాన్ని ఏర్పాటు చేయాలనటం ఏమిటి? అది కూడా పునరుద్ధరించాలనటం హిమాలయమంత అవాస్తవాన్ని మెదళ్లలోకి ఎక్కించే యత్నం తప్ప మరొకటి కాదు. "భారతదేశంలోకి స్థానభ్రంశం చెందిన ముస్లిం జనాభాకు వక్ఫ్ బోర్డును ప్రసాదించారు. ప్రతిగా స్థానభ్రంశం చెందిన హిందువులకు మాత్రం రిక్తహస్తం చూపించారు. పాకిస్థాన్‌లో ప్రతిదీ వదులుకున్న హిందువులకు శూన్యమే మిగిలింది" అని వ్యాసకర్త అనటానికి ఆధారాలు ఏమిటన్నది ప్రశ్న. రాష్ట్రాల వారీగా దేవాదాయ, ధర్మాదాయ సంస్థలకు ఎన్ని భూములు ఉన్నాయో, ఎన్ని ఆస్తులు ఉన్నాయో ఎవరైనా చెబుతున్నారా? వక్ఫ్‌బోర్డుకు భారత్‌లో దానం చేసిన ఆస్తుల నిర్వహణ బాధ్యత ఇచ్చారు తప్ప అదనంగా ఇచ్చిందేమీ లేదు. ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం దేశంలో 8.7లక్షల ఆస్తులు 9.4లక్షల ఎకరాల భూములు ఉన్నాయి, వాటి విలువ రూ.1.2లక్షల కోట్లు. దాన్ని ఒక సంస్థగా చూసి భారతీయ రైల్వేలు, మిలిటరీ తరువాత పెద్దది అని చెబుతున్నారు. దేశంలో దేవాదాయ ధర్మాదాయ ఆస్తుల మొత్తం విలువ ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వం క్రోడీకరించి చెప్పిందా? దాని దగ్గర ఉండవచ్చు గానీ ఎక్కడా బయటికి వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వ ఎన్ఎస్ఎస్ఓ సేకరించిన సమాచారం ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.3.02లక్షల కోట్లు. మన దేశం నుంచి వెళ్లిపోయినవారి ఇక్కడి ఆస్తులను పాకిస్థాన్ వెళ్లినవారికి ఇవ్వలేదు కదా! ఉదాహరణకు హైదరాబాద్ నుంచి పాక్ వెళ్లిన వారి ఇండ్లు, పొలాలను అనేక మంది తరువాత ఆక్రమించి అన్యాక్రాంతం చేసుకున్నారు. వారిలో ముస్లింలు, హిందువులు అందరూ ఉన్నారు. ఇప్పటికీ ఆ వివాదాలు నడుస్తూనే ఉన్నాయి.ఇన్ని దశాబ్దాల అనంతరం కూడా భారతదేశంలో హిందువుల పరిస్థితి మెరుగుపడలేదట. ఇది ఒక మానసిక దాడి, గాలి పోగేయటం తప్ప మరొకటి కాదు. పాకిస్థాన్‌లో ముస్లింలు ఎలా బాగుపడ్డారో రచయిత చెప్పి ఉంటే అర్థం ఉండేది. ఒకవైపు "మతరాజ్యంగా మారిన పాకిస్థాన్ దుస్థితి ఎలా ఉందో చూడండి, మన దేశం ఎలా ముందుకు పోయిందో చూడండి" అంటూ కాషాయదళాలు ప్రచారం చేయటం చూస్తున్నాం. మనదేశాన్ని కూడా మతరాజ్యంగా మార్చటం అంటే మరో పాకిస్థాన్‌గా మార్చాలనేనా? అసలు హిందూరాజ్యం అంటే ఏమిటో, దాని రూపురేఖలు ఎలా ఉంటాయో ఎవరైనా చెప్పగలరా? సామాన్యులకు పట్టింపు లేదు గానీ అసలు సిసలు నిలువుబొట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనేవారు అడ్డబొట్ల ఆలయాల గడప తొక్కరన్న పచ్చినిజం ఎంత మందికి తెలుసు? అలాంటప్పుడు ఎవరి భావనలకు అనుగుణంగా మతరాజ్యాన్ని ఏర్పాటు చేస్తారు? దాన్ని రెండవవారు అంగీకరిస్తారా? అలాంటి రాజ్యంలో ఇతర మతాలవారి పరిస్థితి ఎలా ఉంటుంది. హిందువులు మెజారిటీగా ఉన్నప్పటికీ దురవస్థలో ఉన్నారని పదే పదే చెప్పటం గోబెల్స్ ప్రచారం, అందరూ అదే స్థితిలో ఉన్నారు.

# శ్రీదుర్గ భవాని మాత ఆశీర్వాదం పొందిన తూర్పు జయప్రకాష్ రెడ్డి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 19జులై:
సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో
శ్రీ దుర్గా భవాని మాత ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందదాయకం– న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్. ఆషాడ మాసం పునస్కరించుకొని శ్రీ దుర్గా భవాని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ప్రతి సంవత్సరం 140 కులాల వారిని కలుపుకొని నిర్వహిస్తారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి ప్రతి సంవత్సరం దుర్గ భవాని అమ్మవారి జాతరలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొంది అన్ని కులాల వారితో మమేకమై ఉత్సవ జాతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇట్టి తరుణంలో సదాశివపేట పట్టణ, మండల ప్రజలు ఎంతో ఆనందదాయకంగా తూర్పు జయప్రకాశ్ రెడ్డి తో కలిసి దుర్గా భవాని జాతర సంబరాలు జరుపుకుంటారు.

ఈ యొక్క దుర్గా భవాని జాతర కార్యక్రమంలో భాగంగా న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ తూర్పు జయప్రకాష్ రెడ్డి తో కలిసి శ్రీ దుర్గా భవాని జాతర వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందదాయకంగా ఉందని తెలియజేశారు. అదేవిధంగా అనాది కాలం నుండి, పూర్వీకుల నుండి మహిమగల అమ్మగా పేరుపొందిన శ్రీ దుర్గా భవాని మాత భక్తుల కోరికలు తీర్చటం మరియు అమ్మను నమ్ముకున్న భక్తులను కాపాడుకోవడం, సుఖ సంతోషాలుగా ఉండే విధంగా చూడడం సదాశివపేట పట్టణ శ్రీ దుర్గా భవాని మాత ఆలయం యొక్క ప్రత్యేకత అని కొనియాడారు.ఈ యొక్క కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ , మార్కెట్ కమిటీ చైర్మన్ సాడాకుల కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరు చిరంజీవి కోవూరి శంకర్ గౌడ కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ అరుణ్ కుమార్ మాజీ కౌన్సిలర్ నాగరాజు గౌడ్ మాజీ కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథంమాజీ కౌన్సిలర్ గుండ్ల రవి సదాశివపేట పట్టణ మరియు మండల నాయకులు సిద్ధన్న రాములు గౌడ్ విష్ణువర్ధన్ రెడ్డి మోట్లకుంట రవి రాఘవేందర్ శ్రీకాంత్ గౌడ్ బిట్ల ప్రేమ్ కుమార్ తుకారం ఎండి లతీఫ్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పకడ్బందీగా పంచాయతీ ఆడిట్

అమరావతి, జూలై 19(సందేశం టైమ్స్):రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల పారదర్శకంగా జరిగేందుకు సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. పన్నుల చెల్లింపులన్నీ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పన్నుల సొమ్ముతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా పంచాయతీలు సద్వినియోగం చేసుకునేలా పకడ్బందీ వ్యవస్థను రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భావించింది. ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా ఆడిట్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు పంచాయతీల్లో ఆడిట్ నిర్వహించే స్టేట్ ఆడిట్ అధికారులు, పంచాయతీ ఆడిట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఎస్ఐఆర్‌డీలో ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. విధివిధానాలు కూడా రూపొందిస్తున్నారు.గ్రామ పంచాయతీ ఆడిట్ నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. కేంద్రం ఇచ్చిన నిధులే కాకుండా, ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల సొమ్ముకూడా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆడిట్ అధికారులు, డీపీవో, డీఎల్‌పీవో, ఈఓపీఆర్‌ఆర్డీలు.. అంతాకలిసి పంచేసుకుంటున్నారు. కోస్తా జిల్లాల్లో అత్యధిక ఆదాయ వనరులున్న పంచాయతీల్లో అవినీతి తాండవిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయి. రాజమండ్రి రూరల్‌లోని పలు పంచాయతీల్లో రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఒక ఆడిట్ అధికారి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. పైగా రీ ఆడిట్‌కు ఆదేశించిన ఆ ఆడిట్ అధికారిని పంచాయతీ కార్యదర్శులందరూ ఏకమై బదిలీ చేయించారు.

# పాలమామిడిలో జ్వరాల విజృంభణ

### బాలిక మృతి, 10 మందికి అస్వస్థత
### రోడ్డు సౌకర్యం లేక ఆస్పత్రికి తరలించలేని దుస్థితి
### ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వినతి

చింతపల్లి, జూలై 19(సందేశం టైమ్స్): మండలంలోని అంజలి శనివారం పంచాయతీ పాలమామిడి గ్రామంలో జ్వరాలు విజృంభించాయి. గ్రామంలో జ్వరంతో బాధపడుతుతూ ఒక బాలిక మృతి చెందగా.. మరో పది మంది వైద్యం కోసం నిరీక్షిస్తున్నారు. గ్రామానికి రహదారి సదుపాయం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి తరలించలేని దుస్థితిని స్థానికులు ఎదుర్కొంటున్నారు. పాలమామిడి గ్రామంలో వారం రోజుల క్రితం జ్వరాలు ప్రబలాయి. జ్వర బాధితులను తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. అయితే గ్రామంలో జ్వరాలు అదుపులోకి రాలేదు. గ్రామానికి చెందిన గెమ్మెలి ఝాన్సీ (12) ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఉదయం మరణించింది. బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా గ్రామంలో ఇంటికి ఒకరూ, ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వర బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ కోరారు. మృతి చెందిన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# నిస్తార్ జలప్రవేశం

విశాఖపట్నం, జూలై 19(సందేశం టైమ్స్):ఆపదలో చిక్కుకున్న జలాంతర్గాములను రక్షించడానికి ఆధునిక పరిజ్ఞానంతో స్వదేశీయంగా నిర్మించిన 'ఐఎన్ఎస్ నిస్తార్' విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో జలప్రవేశం చేసింది. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ దీన్ని జలప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నౌకను లోతైన సముద్రంలో సహాయక కార్యకలాపాలు చేపట్టడానికి రూపొందించారన్నారు. ప్రపంచంలో కొన్ని దేశాల వద్దే ఇలాంటి ప్రత్యేక డైవింగ్ టీమ్ కలిగిన సహాయక నౌకలు ఉన్నాయని, అందులో భారత్ కూడా చేరడం గర్వకారణంగా ఉందని చెప్పారు. నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి మాట్లాడుతూ.. ఈ డైవింగ్ సహాయక



నౌక పొరుగు ప్రాంతాలలో కూడా సబ్‌మెరైన్ రెస్క్యూ ఆపరేషన్లలో సహాయం అందిస్తుందన్నారు. నౌకా నిర్మాణ రంగంలో భారత్ ఎదుగుదలకు నిస్తార్ ఓ నిదర్శనంలా నిలుస్తుందన్నారు.

## డీవైఎఫ్ఐ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి



న్యూఢిల్లీ,జూలై 19(సందేశం టైమ్స్):ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల పేరుతో ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని డీవైఎఫ్ఐ అధ్యక్షుడు,ఎంపీ ఏఏ రహీం ఆరోపించారు.శుక్రవారం,డీవైఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్వర్యంలో జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రహీం, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్, ఐద్వా కోశాధికారి పుణ్యవతి, డీవైఎఫఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడారు.

## కొత్తగా రక్తమార్పిడి మండలి



అమరావతి, జూలై 19(సందేశం టైమ్స్):ఆరోగ్యశాఖ మంత్రి నేతృత్వంలో కొత్తగా రక్తమార్పిడి మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆ శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గవర్నింగ్ బాడీలో ఆరోగ్యశాఖ మంత్రి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్, ఆర్థిక శాఖ సెక్రటరీ, ఆరోగ్య శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవోతో పాటు మరో తొమ్మిది మందిని సభ్యులుగా నియమించారు. ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. అలాగే రక్తమార్పిడి మండలికి ఎగ్జిక్యూటివ్ బాడీని కూడా నియమించారు.

## తాగునీరివ్వండి మహాప్రభో..!



పోడూరు, జూలై 19(సందేశం టైమ్స్):సాగు నీరందక రైతులు గగ్గోలు పెడుతున్న తరుణంలో తాగునీరు లేదని మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. పోడూరు మండలం కవిటం లాకు ప్రాంతంలో నాలుగు రోజులుగా పంచాయతీ తాగునీరు ఇవ్వడం లేదని మహిళలు రోడ్డెక్కారు. మార్టేరు %-% పాలకొల్లు రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా నిర్వహించారు. నాలుగు రోజులుగా కుళాయి నీరు ఇవ్వడం లేదని, తక్షణమే తాగునీరు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అర్ధగంటకు పైగా ధర్నా చేయడంతో రోడుపై వాహనాలు నిలిచిపోయాయి. ఎంపీడీవో మంగాకుమారి, పంచాయితీ కార్యదర్శి కృష్ణవేణి అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, మరమ్మతుల కారణంగా నీరు సరఫరా కాలేదన్నారు. మరమ్మతులు పూర్తి చేసి శనివారం నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. దీంతో మహిళలు ధర్నా విరమించారు. అనంతరం తక్షణ చర్యలుగా పంచాయతీ సిబ్బంది నాలుగు ట్రాక్టర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేశారు.

## బడిని ముంచిన జడి వాన




ప్రత్తిపాడు జూలై 19(సందేశం టైమ్స్):నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో కురిసిన భారీ వాననీరు స్థానిక తూర్పుపాలెంలోని ఎంపియుపి పాఠశాలను ముంచెత్తింది. పాఠశాల ఆవరణతోపాటు తరగతి గదుల్లోకి కూడా నీరు చేరడంతో సమీపంలోని ధూపాటి జార్జి ఇంటి భాగంలోని రేకుల షెడ్డులో తరగతులు నిర్వహించాల్సి వచ్చింది. డ్రెయినేజీల పూడిక తీయకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచా యతీ అధికారులను గతంలో పలుమార్లు విన్నవించగా జనం పంచాయతీ పన్నులు చెల్లించని కారణంగా కాల్వల పూడిక తీయడం లేదని సమాధానమిచ్చారని అన్నారు. పనుల్లేక పన్నులు చెల్లించలేక పోయామని చెప్పారు. ఇదిలా ఉండగా గతంలో ఈ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండేవారని, వర్షపు నీరు వస్తుండడంతో విద్యార్థులు పలుమార్లు అసౌకర్యానికి గురయ్యేవారని, క్రమంగా సంఖ్య తగ్గుతూ వచ్చిందని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు.

## పెట్రోల్ పోసి హత్యచేసిన కేసులో నిందితుడు అరెస్టు



వినుకొండ జూలై 19(సందేశం టైమ్స్): నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో ఈనెల 16వ తేదీన తెల్లవారుజామున భార్యాభర్తలపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతోపాటు నీలబోయిన మంగమ్మ (54) మృతికి కారణమైన కేసులో నిందితుడు నీలబోయిన యలమందను అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలను వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. నీలబోయిన పెద్ద శ్రీను, మంగమ్మ దంపతులు, వారి కొడుకూ కోడళ్లయిన బ్రహ్మయ్య, నాగమణి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇంటి మరమ్మతుల కారణంగా వీరు 15 రోజుల నుండి ఇంటి ఎదురుగా ఉన్న వేముల వెంకటేశ్వర్లు పొలంలోని పొగాకు కొట్టంలో నివాసం ఉంటున్నారు. ఇంటి నిర్మాణం సమయంలో వివాదం రావడంతో పెద్ద శ్రీను మరదలు చిన్నమ్మాయి, భార్య మంగమ్మ, కోడలు నాగమణిల మధ్య గొడవ జరిగింది. చిన్నమ్మాయిని పెద్దశ్రీను దూషించడంతోపాటు కొట్టాడు. గతంలో పొలం విషయంలోనూ ఎలమందను తిట్టడంతో అతనిపై ఎలమంద కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో పెద్ద శ్రీను, అతని భార్య మంగమ ఆరుబయట నిద్రిస్తుండగా ఈనెల 16న తెల్లవారుజామున వారిపై ఎలమంద పెట్రోలు పోసి నిప్పంటించి పారిపోయారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కొద్దిసేపటికి మంగమ్మ మృతిచెందింది. పెద్ద శ్రీను ఇప్పటికీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడని డీఎస్పీ వివరించారు. ఎలమందును వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, అయినవోలు, బండ్లమోటు ఎస్సైలు అయినవోలులో శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు.

## చెట్లపై అలవోకగా గొడ్డలి వేటు!



పల్నాడు జిలాజూలై 19(సందేశం టైమ్స్):ప్రభుత్వ శాఖల మధ్య పర్యవేక్షణ లోపం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పర్యావరణానికి శాపమైంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా, కళాకళలాడే ప్రాంతాలు బోసిపోతున్నాయి. విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా ఉన్నాయనే కారణంతో పెద్దపెద్ద చెట్లను మరో ఆలోచన లేకుండా నిర్ధాక్షిణ్యంగా నరికేస్తున్నారు. గతంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను మాత్రమే నరికేవారు. ప్రస్తుతం చిన్నాపెద్దా అనే వ్యత్యాసం లేకుండా భారీ చెట్లను సైతం పూర్తిగా నరికిస్తున్నారు. పనిలో పనిగా ప్రకాష్ నగర్ సప్తపది కళ్యాణ మండపం నుంచి సెయింట్ ఆన్స్ పాఠశాలకు వెళ్లే మార్గంలోని ఓ ఇంటి ఎదుట అడ్డంగా ఉందనే సాకుతో సంబంధం లేని చెట్టునూ నరికించడం ప్రకృతి ప్రేమికులను కలచివేసింది. వాల్టా చట్టాన్ని ప్రభుత్వ శాఖలే అతిక్రమిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మొక్కలను నాటాలని, చెట్లను పెంచాలని వనమహోత్సవాలప్పుడు ఫొటోలకు ఫోజులిచ్చే ప్రభుత్వ శాఖల అధికారులు ఇతర సందర్భాల్లో మొక్కలను పెంచడం అటుంచి ఉన్న చెట్లను తొలగించడం ఎందుకనే ప్రశ్నలు వస్తున్నాయి.

## ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్

విశాఖపట్నం, జూలై 19(సందేశం టైమ్స్):పభుత్వ పాఠశాలల్లో ప్రమాణాల పెంపే లక్ష్యంగా విద్యా శాఖ ప్రణాళికలు రూపొందించింది. కొత్తగా వచ్చిన సాంకేతిక అంశాలను జోడించి వినూత్నంగా బోధన చేయడంపై దృష్టిసారించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే దీనిపై ఫోకస్ పెట్టాలని నిర్ణయించిన ఉన్నతాధికారులు ఆ దిశగా జిల్లా విద్యాశాఖలకు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ మేరకు అకడమిక్ పాలసీని రూపొందించిన విద్యా శాఖ, ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్ అందజేసింది. విద్యా సంవత్సరంలో ప్రతి తరగతికి సంబంధించి బో?ధించాల్సిన పాఠ్యాంశాలపై షెడ్యూల్ రూపొందించింది. ఇప్పటివరకూ ఉపాధ్యాయులే సొంతంగా లెసన్ ప్లాన్ రూపొందించుకుని, నోట్స్ రాసుకుని దాని ఆధారంగా బోధన చేస్తున్నారు. అయితే టీచర్లంతా లెసన్ ప్లాన్ రూపొందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకున్న విద్యా శాఖ, ప్రతి సబ్జెక్టుకు సంబంధించి అన్ని అంశాలతో కూడిన హ్యాండ్ బుక్స్ ముద్రించి టీచర్లకు అందజేసింది. సిలబస్ మేరకు విద్యార్థులకు ఎలా బోధన చేయాలి?, పాఠాలు పిల్లలకు అర్థమయ్యేలా ఏమి చేయాలి?...అనే అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఒక విధంగా చెప్పాలంటే కొత్తగా ఇచ్చిన హ్యాండ్ బుక్స్ టీచర్లకు కరదీపిక వంటిదని అడవివరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అన్నారు. ఇది విద్యార్థులు, టీచర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## ఏపీలో అమానుష ఘటన.. భార్యని హత్య చేసిన భర్త



తిరుపతిజూలై 19(సందేశం టైమ్స్):ఏపీలో అమానుష ఘటన జరిగింది. కుటుంబ వివాదాలు, భార్యపై అనుమానంతో భర్త హత్య చేశాడు. ఈ ఘటన తిరుపతి రూరల్‌లోని మంగళం రిక్షా కాలనీ పరిధిలో జరిగింది. భార్య, భర్తల మధ్య కొంతకాలంగా విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలోనే భార్య ఉషా(34)పై కోపంతో భర్త లోకేశ్వర్ హత్య చేశాడు. మృతురాలు అమర్ రాజా ఫ్యాక్టరీలో ఉద్యోగిని. ఉదయం 5 గంటలకు ఆమె డ్యూటీకి వెళ్తుండగా దారికాచి భర్త లోకేశ్వర్ హత్య చేశాడు.ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. గత కొంతకాలంగా ఉష తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. లోకేశ్వర్ జులాయిగా తిరుగుతూ ఉండటంతో దంపతుల మధ్య విభేదాలు వచ్చాయి. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉషా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఏఎస్పీ రవి మనోహరాచారి, తిరుచానూరు పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ కుమార్, మంగళం క్లస్టర్ ఎస్ఐ జగన్నాథ్ రెడ్డి పరిశీలించారు. భార్య హత్య అనంతరం తిరుమల నగర్‌లో భర్త లోకేశ్వర్ ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు తెలిపారు. భార్త, భర్తలు మృతిచెందడంతో వీరి ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

# ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?



## శ్రీకాకుళం నగరంలో రోడ్డుపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు
## - జిల్లాలో పెరుగుతున్న వినియోగం
## - పర్యావరణానికి తీవ్ర ముప్పు
## - జూట్, కాగిత సంచులు ఉపయోగించాలంటున్న నిపుణులు

శ్రీకాకుళం క్రైజూలై 19(సందేశం టైమ్స్): జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం కానరావడం లేదు. నగరాలు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తోన్నాయి. శ్రీకాకుళం నగరంలో ప్రతిరోజూ రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి. నగరం చెంతనే ఉన్న నాగావళి నదిలో సగటున రోజుకు టన్నుల రూపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలుస్తున్నాయి. ఉదయం పాల ప్యాకెట్ల నుంచి రాత్రి వరకు దయనందిన జీవితంలో ప్రతి వినియోగానికి ప్లాస్టిక్ వాడుతుండడం ఆందోళన కలిగిస్తుంది. ఆరు నెలల కిందట ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న 110 మంది వ్యాపారులను గుర్తించి రూ.3 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఆ తర్వాత తనిఖీలు లేకపోవడంతో నగరంలో ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ విక్రయాలు అధికంగా ఉన్నాయి. ప్రతి నెల టన్ను మేర ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు జరుగుతున్నట్టు తెలుస్తుంది. ఆమదాలవలసలో సైతం రోజుకు 26 టన్నుల చెత్తను సేకరిస్తుండగా అందులో రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. పలాస, కాశీబుగ్గ, మున్సిపాలిటీలో 29 టన్నుల చెత్త సేకరణ జరుగుతుండగా నాలుగు టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్టు తెలుస్తోంది.జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విక్రయదారులు కనీస నిబంధనలు పాటించడం లేదు. వాస్తవానికి 2022లో ప్లాస్టిక్‌ను కేంద్రం పూర్తిగా నిషేధించింది. కానీ, జిల్లాలో అదెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. నగర పాలకసంస్థలు, మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. కానీ, కొందరు ఆ లైసెన్స్‌లు లేకుండానే విక్రయాలు చేపడుతున్నారు. అయినా సరే యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 125 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులనే వినియోగించాలి. ఆలోపు ఉన్నవి పూర్తిగా వినియోగించకుండా నిషేధం విధించింది. కానీ, జిల్లాలో మాత్రం ఆ నిబంధనలు పట్టించుకోవడం లేదు. పురపాలక, కాలుష్య నియంత్రణ మండలి, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాల్సి ఉంది. అయితే, ఆ శాఖలు మాత్రం నిద్దరోడుతున్నట్టు విమర్శలు ఉన్నాయి.

మానవాళికి ముప్పు..ప్లాస్టిక్ వస్తువులను మితిమీరి వినియోగించడం వల్ల పర్యావరణంతో పాటు మానవాళికి ముప్పు ఏర్పడుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. గోనె, కాగిత సంచులు వినియోగించాలని మొరపెట్టుకుంటున్నా ప్రజల చెవికెక్కడం లేదు. అల్పాహార, మాంసాహార హోటళ్లు, ఫుట్‌పాత్, టీ దుకాణాల్లో వేడి టీ, కాఫీ, పాలు, కూరలను పాలిథిన్ సంచుల్లో పార్శిల్ చేస్తున్నారు. ఈ పదార్థాలు తినడం వల్ల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ నిషేధంపై యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన అవసరంఉంది.కఠిన చర్యలు తీసుకుంటాం శ్రీకాకుళం నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. తనిఖీలు పెంచుతాం. పట్టుబడితే భారీ జరిమానాలు విధిస్తాం. వ్యాపారులు, ప్రజలు సహకరించాలి. జూట్ బ్యాగ్‌లను వినియోగించాలి. ఇప్పటికే దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పించాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలకు ఉపక్రమిస్తాం.

# పగతోనే జంట హత్యలు

### నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ డి.పావన్‌కుమార్
### మద్యంతో మొదలై.. డబ్బు పంపకాల వరకూ..
### %రౌడీషీటర్‌ను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



విజయవాడ, జూలై 19(సందేశం టైమ్స్):ఇద్దరు స్నేహితులు మరో ఇద్దరితో కలిసి మందు పార్టీలు ఏర్పాటు చేసుకునేవారు. అదే గదిలో ఉంటున్న రౌడీషీటర్‌కు అది నచ్చేది కాదు. ఇక్కడి నుంచి మొదలైన వివాదమే జంట హత్యలకు దారితీసింది. గవర్నరుపేటలో అన్నపూర్ణ థియేటర్ ఎదురుగా ఉన్న వీధిలో రాజు, వెంకటరమణను దారుణంగా హత్య చేసిన రౌడీషీటర్ జమ్ము కిషోర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించారు. నైజాంగేటు ప్రాంతానికి చెందిన జమ్ము కిషోర్ భార్యతో గొడవలు పడి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. క్యాటరింగ్ పనులు చేస్తున్న కిషోర్ గదికి వచ్చేసరికి పలుమార్లు రాజు, వెంకటరమణ మందు పార్టీ చేసుకుంటూ కనిపించేవారు. శివ భక్తుడైన కిషోర్ పూజ చేసుకునే సమయంలో ఆ స్నేహితులిద్దరూ సెల్‌ఫోన్‌లో పాటలు వినేవారు. పూజ చేసుకునేటప్పుడు పాటలు పెట్టడం వల్ల ఇబ్బందిగా ఉంటోందని వారితో గొడవలు పడ్డాడు. ఈ మొత్తం గొడవలతో వారిపై కిషోర్ పగ పెంచుకున్నాడు. డబ్బు పంపిణీలో వచ్చిన వివాదంతో ఈ పగ మరింత పెరిగింది. 16వ తేదీన జరిగిన గొడవలో రాజు, వెంకటరమణను కత్తితో పొడిచి పారిపోయాడు. ఏలూరు రోడ్డు మీదకు వెళ్లి ఆటో ఎక్కి హనుమాన్‌పేటలో దిగాడు. అక్కడ ఉన్న విశ్వేశ్వరయ్య పార్కు వద్దకు నడుచుకుంటూ వెళ్లి కత్తిని పాలిథిన్ కవర్‌లో చుట్టి పార్కులో ఉన్న పొదల్లోకి విసిరేశాడు. అక్కడి నుంచి నైజాంగేటుకు చేరుకుని రైల్లో సికింద్రాబాద్ పారిపోయాడు. సాంకేతికంగా గుర్తించిన పోలీసులు అతడ్ని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు. కిషోర్‌ను విజయవాడ కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు.

# 24న అల్పపీడనం




విశాఖపట్నం/అమరావతి, జూలై 19(సందేశం టైమ్స్):ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు, రైతులకు ఇక వర్షాలతో ఉపశమనం లభించనుంది. దక్షిణ కోస్తా పరిసరాల్లో శుక్రవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు చెన్నై మీదుగా తూర్పు, పడమరకు ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో బంగాళాఖాతం నుంచి భారీగా తేమగాలులు కోస్తాపైకి వీస్తున్నాయి. దీంతో కోస్తాలో అనేకచోట్ల రుతుపవనాలు చురుగ్గా మారి రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం ఉదయం నుంచి ఉదయం వరకు గుంటూరు జిల్లా వంజిపురంలో 130.5, ప్రకాశం జిల్లా టంగుటూరులో 123.25, గుంటూరు జిల్లా నల్లపాడులో 106.3, కడప జిల్లా కామకుంటలో 103 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే శుక్రవారం రాత్రి 7 గంటల వరకు కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 67.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా సుదీర్ఘకాలం ఎండలు, వర్షాభావం కొనసాగిన కోస్తా, రాయలసీమల్లో వర్షాలు ప్రారంభం కావడం ఖరీఫ్ పంటలకు ప్రాణం పోసినట్టయిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22 వరకు రాష్ట్రంలో ఈ వర్షాలు కొనసాగుతాయని వివరించారు. కాగా, ఈనెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని చెప్పారు.

# కొత్త సింగిల్ మేజర్‌విధానంలోకి మారాలి

### డిగ్రీ కోర్సుల్లో ప్రస్తుత సీట్ల సంఖ్యనే కొనసాగింపు
### నూతన కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లోకి మారడంపై ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు



అమరావతి జూలై 19(సందేశం టైమ్స్):సింగిల్ మేజర్ డిగ్రీ నుంచి కొత్త సింగిల్ మేజర్ డిగ్రీ విధానంలోకి మారేందుకు డిగ్రీ కాలేజీలకు ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు జారీచేసింది. ప్రస్తుత సింగిల్ మేజర్ విధానం నుంచి 2025-26లో అమలు చేయబోయే నూతన సింగిల్ మేజర్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లోకి మారాలని స్పష్టం చేసింది. కన్వర్షన్ కోసం ఈనెల 18 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. 25 నుంచి 27 వరకు రూ.7 వేలు, 28 నుంచి 30 వరకు రూ.10 వేల జరిమానాతో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించింది. ఈనెల 25 నుంచి 31 వరకు ప్రతిపాదనల పరిశీలన జరుగుతుందని, ఆగస్టు 1న అనుమతులు జారీ అవుతాయని వెల్లడించింది. ఇటీవల డ్యూయెల్ మేజర్ కన్వర్షన్ కోసం ఫీజులు చెల్లించిన కాలేజీలు మళ్లీ కట్టాల్సిన అవసరం లేదని తెలిపింది. ప్రతి కోర్సులో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యనే యథావిధిగా మార్చుకోవాలని స్పష్టం చేసింది. ప్రస్తుత కోర్సు నుంచి కొత్త కోర్సులోకి మారాలంటే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నట్లు చూపించాలని తెలిపింది. బీబీఏ, బీసీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు జారీచేస్తున్నందున.. ఆ సంస్థ అనుమతి లేకుండా ఆ కోర్సులకు మార్చుకోవడం కుదరని పేర్కొంది. 2024-25 విద్యాసంవత్సరంలో డిజిటల్ అఫిలియేషన్ పొందిన కాలేజీలకు మాత్రమే కన్వర్షన్‌కు అవకాశం ఉంటుందని, డిజిటల్ అఫిలియేషన్ లేని కాలేజీలు ప్రొవిజినల్ అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. అన్ని కోర్సులు ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే ఉంటాయని తెలిపింది. బీకాం, బీకాం(సీఏ), బీబీఏ, బీసీఏ, బీ ఒకేషనల్, ఏఈడీపీ కోర్సులకు కన్వర్షన్ ప్రతిపాదనలు అవసరం లేదని పేర్కొంది. సాధారణ డిగ్రీ కాలేజీలు కోర్సులను హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లోకి మార్చుకోవడం కుదరదని స్పష్టం చేసింది.

# అన్నవరంలో ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెండ్



అన్నవరం,జూలై 19(సందేశం టైమ్స్):కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నెయ్యి డబ్బాలను దొంగిలిస్తూ పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. సత్యదేవుడి తొలిపావంచా వద్ద కనకదుర్గ ఆలయంలో ఉప ప్రధాన అర్చక హోదా కలిగిన చిట్టెం హరిగోపాల్ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో హోమాలు, దీపారధన తదితర వాటికి వినియోగించాల్సిన 3 డబ్బాల నెయ్యిని శుక్రవారం ఎటువంటి అనుమతి లేకుండా కారులో తరలించే ప్రయత్నం చేయడంతో ఈవోకు అందిన సమాచారంతో ఆయన ఆదేశాలతో ఏఈవో భాస్కర్ హుటాహుటిన వెళ్లి నిర్ధారించి ఈవోకు నివేదించారు. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పట్టుబడిన నెయ్యి డబ్బాల విలువ రూ.27వేలుగా అధికారులు తెలిపారు. 3 డబ్బాలను విచారణాధికారులు స్వాధీనం చేసుకుని దేవస్థానం సెంట్రల్‌స్టోర్స్‌కి తరలించారు. గతేడాది పదవీ విరమణ చేయాల్సిన సమయంలో ప్రభుత్వ జీవో కారణంగా ఆయన విధుల్లో కొనసాగుతున్నారు. ఆది నుంచి అర్చకుడు వివాదాస్పదంగానే విధులు నిర్వహిస్తుండడం విశేషం. గతంలో ఒకసారి అతడు పనిచేసే వనదుర్గ ఆలయ తాళాలు ఇంటికి పట్టుకెళ్లిన సంఘటనను సహచర అర్చకులు గుర్తుచేస్తున్నారు. అలాగే ఇదే సంఘటనలో అదే ఆలయంలో పరిచారకుడిగా పనిచేస్తున్న ఎన్‌ఎస్.సుబ్రహ్మణ్య కృష్ణకుమార్‌ను కూడా సస్పెండ్ చేశారు.

# వర్షమా.. అయితే మాకేం సంబంధం..

హైదరాబాద్ సిటీ:జూలై 19(సందేశం టైమ్స్): ఒక్క వాన.. నగరంలో వరద నీటి ప్రవాహ వ్యవస్థ డొల్లతనమే కాదు.. ప్రభుత్వ విభాగాల వైఫల్యాన్నీ బహిర్గతం చేసింది. కుంభవృష్టితో మహానగర పౌరులు అవస్థలు పడుతున్నా.. గంటల తరబడి రోడ్లపై ట్రాఫిక్ జామ్‌తో తిప్పలు పడినా పట్టించుకున్న నాథుడు లేడు. అక్కడక్కడా మినహా అత్యవసర బృందాలు కనిపించలేదు. పలు డివిజన్లలో ఇళ్లలోకి వరద నీరు వచ్చిన ప్రాంతాలను సందర్శించిన కార్పొరేటర్లు.. డిప్యూటీ మునిసిపల్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఫోన్ చేసినా స్పందించక పోవడం గమనార్హం.మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అప్రమత్తంగా ఉండండి అని ఓ ప్రకటన విడుదల చేసి మిన్నకున్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం సాయంత్రం నగరానికి వచ్చిన బల్దియా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కూడా క్షేత్రస్థాయిలో




కనిపించ లేదు. వివిధ ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన నీరు పోయేందుకు వర్షపు నీరు డ్రెయినేజీ ఎక్కడుందో వెతికేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులు పడ్డారు. ఇక భారీ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ మినహా ప్రధాన శాఖల అధికారులెవ్వరూ రోడ్లపైకి రాలేదు.

# రుద్రంపూర్‌లో దోమల నివారణకు ఫాగింగ్

రామవరం, జూలై 19(సందేశం టైమ్స్): వర్షాకాలం ప్రారంభం అయింది. ఎక్కడ చూసినా నీళ్లు నిలుస్తుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమలతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యాతో పాటు వైరల్ జ్వరాలు విజృంభించే అవకాశం ఉంది. దానిని దృష్టిలో పెట్టుకుని రుద్రంపూర్ పంచాయతీ అధికారి, సిబ్బంది దోమలపై యుద్ధాన్ని ప్రకటించారు. పంచాయతి సెక్రటరీ నరేందర్ ప్రత్యేక చొరవ చూపి పంచాయతీ పరిధిలోని ప్రతి ఏరియాలో ఫాగింగ్ చేసేలా ఆదేశించారు. దీంతో ఇకనుండి వారంలో ఒకసారి ఫాగింగ్




నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే మురుగు కాల్వల్లో నీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పిచ్చి చెట్లు దోమలకు ఆవాసాలుగా మారుతున్న తరుణంలో పిచ్చి మొక్కల తొలగింపును చేపట్టారు. ఫాగింగ్ కార్యక్రమాన్ని పంచాయతీ గుమస్తా సలీం, రాజేశ్ పర్యవేక్షిస్తున్నారు.

# గంజాయి ముఠా అరెస్టు



నకిరేకల్, జూలై 19(సందేశం టైమ్స్): గంజాయి విక్రయిస్తూ, తాగుతున్న 10మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.83,500 విలువ గల 3.340 కిలోల గంజాయి, 10 సెల్‌ఫోన్లు, రూ.9,500 నగదును స్వాధీనం చేసుకున్నామని, ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. ఈమేరకు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో నిందితుల వివరాలు వెల్లడించారు. కొంతకాలంగా నకిరేకల్‌లో నివాసముంటూ నారాయణ స్వామి డెయిరీ ఫామ్‌లో నకిరేకల్ పట్టణానికి చెందిన ఎ2 కిశోర్ టండన్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.%గంజాయి విక్రయిస్తూ సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఒడిశా రాష్ట్రంలోని కిశోర్ సొంత గ్రామానికి చెందిన వరుసకు అన్న అయినటువంటి ఎ1 బోలనాథ్ వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి అక్కడినుంచి తీసుకువచ్చి నకిరేకల్‌లో రైస్ మిల్లులో పనిచేస్తున్న ఎ3 అర్జున్ కుమార్, ఎ4 అనిల్ మండల్, ఎ5 అబ్బు, ఎ6 బికాస్, ఎ7 వికాస్‌లను పరిచయం చేసుకొని ఒక్కొక్కరికీ 500 గ్రాముల చొప్పున ఎక్కువ ధరకు గంజాయిని విక్రయించాడు. గంజాయి ఎక్కువగా తాగుతున్న ఎ8 క్రాంతి, ఎ9 సంతు, ఎ10 అఖిల్‌రెడ్డి, ఎ11 సియాం, ఎ12 శ్రీకాంత్, ఎ13 నాగేందర్ మరికొంత మందికి ఒక్కొక్కరికీ 50 గ్రాములు చొప్పున అమ్ముతున్నారు. మొత్తం 13 మందిలో 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ తెలిపారు.గురువారం సాయంత్రం నకిరేకల్ పట్టణ శివారులోని సాయి ప్రియ హోటల్ వెనుక గడ్డివాము పక్కన ఓ ఇంట్లో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. ముగ్గరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, నల్లగొండ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడం కోసం మిషన్ పరివర్తన్ కార్యక్రమంతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన అనేక మందిని కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో మార్పు తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో నకిరేకల్ సీఐ రాజశేఖర్, రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ లచ్చిరెడ్డి, పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, సుధాకర్, సురేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సైకిల్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి గాయాలు



కారేపల్లి, జూలై 19(సందేశం టైమ్స్):సైకిల్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో జరిగింది. ఖమ్మం పట్టణానికి చెందిన భూపతి సుమన్ బైక్‌పై ఇల్లెందు వైపు వెళ్తున్నాడు. సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండాకు చెందిన వస్రాం సైకిల్‌పై కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లెందు కారేపల్లి ప్రధాన రహదారిపై ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో బైక్ అదుపుతప్పి సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సుమన్ తీవ్రంగా గాయపడగా, సైకిల్‌పై ఉన్న వస్రాంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇరువురిని కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సుమన్‌ను మెరుగైన వైద్యం కోసం వైద్య సిబ్బంది 108 వాహనం ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 42 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

కోల్ సిటీ, జూలై 19(సందేశం టైమ్స్):కంటి సమస్యతో బాధపడుతున్న పలువురికి లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని ఆర్యవైశ్య భవన్ లో రేకుర్తి కంటి దవాఖాన సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 102 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా వీరిలో 42 మంది తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్నారని గుర్తించి వారిని ప్రత్యేక బస్సులో కరీంనగర్ కు సొంత ఖర్చులతో తీసుకవెళ్లి ఉ




చితంగా కంటి ఆపరేషన్లు చేయించి అద్దాలను అందజేశారు.

# చేప పిల్లల కథ కంచికేనా?

జూలై 19(సందేశం టైమ్స్)::ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి ఎగనామం పెట్టే అవకాశం కనిపిస్తున్నది. గతేడాది సైతం చెరువుల్లో కేవలం 50 శాతం సీడ్ వేసి చేతులు దులుపుకున్నది. ఇప్పుడు మొత్తానికే మంగళం పాడి మత్స్యకారుల ఉపాధి గండికొట్టనున్నది. ఇప్పటి వరకు కనీసం టెండర్లు కూడా పిలువ కపోవడం ఇందుకు బలం చేకూర్చుతున్నది. గత సంవత్సరం పంపిణీ చేసిన చేప పిల్లలకు స ర్కారు డబ్బులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. దీంతో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.కేసీఆర్ కులవృత్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్వవైభవం తీసుకురాగా రేవంత్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కులవృత్తులను బలోపేతం చేయడంతో గొల్లకుర్మలు, ముదిరాజ్ తదితర చేతివృత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందారు. కాగా ప్రస్తుతం మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. ముదిరాజ్‌లకు ప్రధానంగా చేయూతనిచ్చిన ఉచిత చేప



పిల్లల(సీడ్) పంపిణీ పథకానికి కాంగ్రెస్ సర్కారు స్వస్తి పలికేందుకే టెండర్లు పిలవడం లేదని తెలుస్తున్నది. జూన్, జూలై నెలల్లో టెండర్లు పిలిచి, ఆగస్టు మొదటి వారంలో చెరువుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా, ఇంతవరకు టెండర్లే పిలువలేదు. గత సంవత్సరం మూడు నెలలు ఆలస్యంగా 50 శాతం సీడ్ పంపిణీ చేయడంతో చేపలు ఎదగలేదని, దీంతో చాలా నష్టపోయామని మత్స్యకారులు తెలుపుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏటా జూలై, ఆగస్టులోనే చేప పిల్లలను చెరువుల్లో వదిలేదని తెలుపుతున్నారు.ఉపాధి కోల్పోనున్న మత్స్యకార కుటుంబాలు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 832 చెరువులు, మూడు రిజర్వాయర్లుండగా 116 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, 8 785 మంది సభ్యులున్నారు. 25 మహిళా మత్స్య సహకార సం ఘాలున్నాయి. జిల్లాలో 2022–23వ సంవత్సరంలో 3 కోట్లు, 2023–24లో 2.57 కోట్ల చేప పిల్లలను ఆగస్టు మొదటి వారంలోపే చెరువులకు చేర్చి ముదిరాజుల కళ్లలో ఆనందాన్ని నింపింది. వరంగల్ జిల్లాలో 732 జలాశయాలుండగా, 142 సొసైటీల్లో 14,200 మంది సభ్యులున్నారు. ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ చేయకుంటే మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోనున్నాయి.

# కూలి ఇస్తామని కూడు కూడా పెట్టలేదు.. సీఎం రేవంత్ సభపై ప్రజల ఆగ్రహం



కొల్లాపూర్, జూలై 19(సందేశం టైమ్స్):వెల్లి మండల పరిధిలోని జటప్రోలులో జరిగిన సీఎం కార్యక్రమానికి కొంతమంది మహిళలకు, చిన్నారులకు కూలి ఇస్తామని తీసుకొని వచ్చి కూడు కూడా పెట్టలేదని బాధిత మహిళలు ఆరోపించారు. సాయంత్రం కొల్లాపూర్ పట్టణంలోని మొబైల్ క్యాంటీన్ వద్ద ఆకలితో తల్లడిల్లుతున్న చిన్నారులను మహిళలను నమస్తే తెలంగాణ ఆరా తీసింది. సీఎం కార్యక్రమంలో కోలాటం వేసేందుకు పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామం నుంచి అధికార పార్టీ నాయకులు మీటింగ్ వద్దకు తీసుకొని వచ్చారు. కానీ మధ్యాహ్నం భోజనం పెట్టించలేదన్నారు. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని వారు వాపోయారు. చిన్నారులు ఆకలితో అలమటించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు%సీఎం బహిరంగ సభకు బందోబస్తుకు వచ్చిన వచ్చిన పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్యూటీ పోలీసులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో అవస్థలు పడ్డారు. గురువారం రాత్రి నుంచి ఏకధాటిగా మధ్యాహ్నం వరకు వర్షం పడటంతో వర్షంలోనే డ్యూటీలు చేస్తూ ప్రజాసంఘాల నాయకులను వివిధ పార్టీల నాయకులను జర్నలిస్టులను అరెస్టు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో బహిరంగ సభ ప్రాంగణంలో చిన్నచిన్న ప్యాకెట్లుల్లో అందించిన నాసిరకం భోజనం తిని అసహనం వ్యక్తం చేశారు.




# క్రీడావార్తలు




## కివీస్ రెండో విజయం



హరారే: ముక్కోణపు టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో ఆతిథ్య జింబాబ్వేను ఓడించింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 120/7 స్కోరుకే పరిమితమైంది. మధెవెరె (36), బెన్నెట్ (21) మాత్రమే రాణించారు. మ్యాట్ హెన్రీ (3/26) మూడు వికెట్లు పడగొట్టాడు. స్వల్ప ఛేదనను కివీస్ 13.5 ఓవర్లలో 122/2 స్కోరుతో పూర్తి చేసింది. కాన్వే (59 నాటౌట్) హాఫ్ సెంచరీ చేయగా, రచిన్ (30) సత్తా చాటాడు. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ టాప్‌లో నిలిచింది. దక్షిణాఫ్రికా (2 పాయింట్లు) ఆ తర్వాతి స్థానంలో నిలవగా, జింబాబ్వే పాయింట్ల ఖాతా తెరవలేదు.

## బీసీసీఐ ఆర్జన రూ.9,741 కోట్లు



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా విలసిల్లుతున్న బీసీసీఐ తమ ఆదాయాన్ని ఏటేటా రికార్డు స్థాయిలో పెంచుకుంటోంది. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను బోర్డు ఆదాయం రూ.9,741.70 కోట్లుగా తేలింది. ఇందులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ద్వారానే ఏకంగా రూ.5,761 కోట్లు (59 శాతం) సమకూరడం విశేషం. 2007లో ఐపీఎల్ మొదలైనప్పటినుంచి బోర్డు ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. మరోవైపు బోర్డు దగ్గర దాదాపు రూ. 30 వేల కోట్లు రిజర్వ్‌లో ఉండగా, దానిపై వచ్చే వడ్డీయే ఏడాదికి వెయ్యి కోట్లు.

## ఫీజులో కోత.. ఓ డీమెరిట్ పాయింట్



దుబాయ్: ఇంగ్లండ్ మహిళలతో తొలి వన్డేలో నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను టీమిండియా బ్యాటర్ ప్రతికా రావల్‌కు జరిమానా విధించారు. భారత ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ప్రతిక.. సింగిల్ తీసే క్రమంలో ప్రత్యర్థి బౌలర్ లారెన్ ఫిలర్‌ను ఢీకొట్టింది. అంతేగాకుండా తర్వాతి ఓవర్‌లో తాను అవుటవగానే ప్రతిక.. మరో బౌలర్ సోఫీ ఎకెల్‌స్టోన్‌తో వాగ్వాదానికి దిగింది. దీంతో లెవెల్ 1 తప్పిదం కింద ప్రతికకు మ్యాచ్ ఫీజులో పది శాతం కోత విధించడంతో పాటు ఓ డీ మెరిట్ పాయింట్‌ను కేటాయించారు. అదే మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్ జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో ఐదు శాతం కోత విధించారు.

## క్వార్టర్స్‌లో హంపి, హారిక



బటూమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేశ్ బాబు, దివ్యా దేశ్‌ముఖ్ ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్‌లో పతకం సాధించే దిశగా దూసుకెళుతున్నారు. ఈ నలుగురు క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. కాగా, ఒకే దేశానికి చెందిన నలుగురు క్రీడాకారిణులు క్వార్టర్స్ చేరడం టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. శుక్రవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్ టైబ్రేకర్లలో అలెగ్జాండ్రా కొస్టెన్యూక్ (స్విట్జర్లాండ్)ని హంపి, రష్యా గ్రాండ్‌మాస్టర్ క్యాటరీనా లగ్నోని హారిక ఓడించారు. ఇక.. కమలిదెనోవా (కజకిస్థాన్)పై వైశాలి, చైనాకు చెందిన రెండో సీడ్ జు యినెర్‌పై దివ్య విజయం సాధించారు.

## హనుమాన్ చాలీసా నుంచి పాప్ గీతాల వరకు..



మాంచెస్టర్: నాలుగో టెస్టు కోసం భారత జట్టు కెంట్ కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో జోరుగా ప్రాక్టీస్ చేస్తోంది. లండన్ నుంచి బెకెన్‌హామ్‌లోని ఈ మైదానం కోసం ఆటగాళ్లంతా గంటపాటు ప్రయాణించారు. ఈక్రమంలో అలిసిపోయినట్టు కనిపించిన వీరంతా డ్రెస్సింగ్ రూమ్‌లో తమకిష్టమైన సంగీతాన్ని వింటూ సేద తీరారు. ఇందులో హనుమాన్ చాలీసా నుంచి ఇంగ్లిష్ పాప్ గీతాలు, పంజాబీ హిట్స్ కూడా ఉన్నాయి. ఇక పంత్, బుమ్రా వామప్ చేసి కొంచెం సేపు జిమ్‌లో గడిపారు. బుమ్రాతో పాటు సిరాజ్ మాత్రం బౌలింగ్ వేయలేదు. ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్‌తో పాటు పేసర్ అర్ష్‌దీప్‌లను ఆడించాలని మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్ సూచించాడు. 'అర్ష్‌దీప్ బంతిని చక్కగా స్వింగ్ చేయగలడు. అలాగే పాత బంతితో రివర్స్ స్వింగ్‌ను కూడా రాబట్టగలడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఇలా చేయగలగడం భారత్‌కు లాభిస్తుంది. అలాగే స్పిన్నర్ కుల్దీప్ సైతం జట్టుకు కీలకంగా మారతాడు. ఇక వీరిని భర్తీ చేసేందుకు నితీశ్ కుమార్, సుందర్‌లను పక్కకు తప్పించవచ్చు. టెస్టుల్లో గెలవాలంటే కచ్చితంగా ఐదుగురు బౌలర్లు ఉండాల్సిందే. ఎందుకంటే ఆరుగురు బ్యాటర్లు భారీ స్కోరు సాధించలేకపోతే, కనీసం బౌలర్లయినా బాధ్యత తీసుకుంటారు. పార్ట్ టైమ్ బౌలర్లతో మ్యాచ్‌లు గెలవలేం' అని వెంగీ తెలిపాడు. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో డ్యూక్ బంతుల నాణ్యతపై అధికంగా చర్చ సాగుతోంది. ఇప్పటిదాకా జరిగిన మూడు టెస్టుల్లోనూ బంతి ఆకారంపై భారత ఆటగాళ్లు అంపైర్లకు పదేపదే ఫిర్యాదు చేయడం తెలిసిందే. ముఖ్యంగా 30 ఓవర్ల తర్వాత ఈ సమస్య ఎక్కువగా వస్తోంది. దీంతో పదే పదే బంతులను మార్చుతుండడంతో ఆటకు కూడా అంతరాయం కలుగుతోంది. అటు విశ్లేషకులు సైతం డ్యూక్ బంతుల పనితీరుపై సందేహాలు వ్యక్తం చేశారు. తొలి టెస్టు ముగిశాక భారత కెప్టెన్ గిల్ బాహాటంగానే ఈ విషయమై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. డ్యూక్ బాల్స్ త్వరగా గట్టితనాన్ని కోల్పోతున్నట్టు, దీంతో బ్యాటర్లకు అనుకూలంగా మారుతున్నాయని ఆరోపించాడు. బంతి మెత్తబడితే పేసర్లకు ఉపయోగం ఉండదని, ఎందుకు ఇలా అవుతున్నాయో అర్థం కావడం లేదని చెప్పాడు.

## ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్.. నాలుగో టెస్టులో అతడికి చోటిస్తే భారత్‌కు విజయం



ఇంటర్నెట్ డెస్క్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత్ వెనుకబడింది. మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్టులో గెలిస్తేనే సిరీస్ సొంతమయ్యేది. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గంభీర్‌పై తీవ్ర ఒత్తిడి ఉందని అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అయితే, నాలుగో టెస్టులో విజయం సాధించేందుకు కుల్‌దీప్ యాదవ్‌ను రంగంలోకి దించాలని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ సూచించాడు%టీమిండియా స్క్వాడ్‌లో భాగమైనప్పటికీ కుల్‌దీప్‌కు ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఇంకా చోటు దక్కలేదు. ఇప్పటివరకూ అతడు ఇంగ్లండ్‌పై ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో కుల్‌దీప్‌ను రంగంలోకి దించాలని క్లార్క్ సూచించాడు. 'ఇండియా అద్భుతంగా ఆడింది. ముఖ్యంగా జడేజా ప్రదర్శన అద్భుతం. అయితే నేనొక విషయం బహిరంగంగా చెప్పదలుచుకున్నాను. ప్లేయింగ్ ఎలెవెన్‌లో కుల్‌దీప్‌కు చోటివ్వాలి. అతడిని రంగంలోకి దించండి. ఎలాగోలా ఈ పని చేయండి"వాస్తవానికి వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అవసరమైనప్పుడు రన్స్ కూడా స్కోర్ చేశాడు. ఇక జడేజా పెర్‌ఫార్మెన్స్ అద్భుతం. ఎన్నో సందర్భాల్లో జట్టుకు అండగా నిలిచాడు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, మూడో టెస్టులో అతడికి మరో ఎండ్‌లో మద్దతుగా ఎవరైనా ఉంటే బాగుండేది. అతడికీ ఇదే అనిపించి ఉంటుంది' అని అన్నాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ 22 పరుగుల స్వల్ప తేడాతో ఓటమి చవి చూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్లార్క్ సూచనను గిల్, గంభీర్ స్వీకరిస్తారో లేదో తెలియాల్సి ఉంది.

## సిరీస్ లక్ష్యంగా..



లండన్: తొలి వన్డే విజయంతో జోష్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో శనివారం ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో తలపడనుంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ సేన 3-2తో గెలిచిన విషయం తెలిసిందే. అలాగే శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో మేలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌ను సైతం గెలిచిన భారత్ ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే ఈ ఏడాది చివర్లో భారత్‌లోనే జరిగే వన్డే వరల్డ్‌కప్‌నకు కూడా ఈ సిరీస్ విజయం చక్కటి సన్నాహకం కానుంది. పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ జట్టులో లేకపోయినా బౌలింగ్ విభాగం రాణించగలుగుతోంది. క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డిలతో పాటు స్పిన్నర్లు శ్రీచరణి, స్నేహ్ రాణా విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఇక తొలి వన్డేలో భారత బ్యాటింగ్ విభాగం కలిసికట్టుగా రాణించింది. కెప్టెన్ హర్మన్ నిరాశపర్చినా ఓపెనర్లు ప్రతికా రావల్, మంధానతో పాటు మిడిలార్డర్‌లో జెమీమా, దీప్తి శర్మ కీలకంగా నిలిచారు. చివర్లో అమన్‌జోత్ హిట్టింగ్‌తో చెలరేగడం జట్టుకు లాభించేదే. అటు ఆతిథ్య ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్ చావోరేవో కాబట్టి లార్డ్స్‌లో గెలిచి తీరాలనే కసితో బరిలోకి దిగనుంది. జట్టు మిడిలార్డర్ ఫర్వాలేదనిపించినా టాపార్డర్ వైఫల్యం దెబ్బతీసింది. నేటి పోరులో అన్ని విభాగాల్లో రాణించి ప్రత్యర్థిని కట్టడి చేయడంతో పాటు సిరీస్‌లోనూ నిలవాలని సివర్ బ్రంట్ బృందం భావిస్తోంది.

# బిజినెస్



## ఎస్‌బీఐకి వరల్డ్ బెస్ట్ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డు



న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. 2025 సంవత్సరానికి గాను గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ నుంచి ప్రపంచంలోనే అత్యుత్తమ కన్స్యూమర్ బ్యాంక్ అవార్డును గెలుచుకుంది. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్స్, బ్యాంకర్స్, విశ్లేషకుల నుంచి సేకరించిన వివరాలను మదింపు చేయటంతో పాటు సమగ్ర పరిశోధన, విశ్లేషణ ఆధారంగా ఎస్‌బీఐని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు గ్లోబల్ ఫైనాన్స్ వెల్లడించింది. కాగా బ్యాంక్ అభివృద్ధి వ్యూహానికి ఖాతాదారుల అనుభూతి మూలస్తంభమని ఎస్‌బీఐ చైర్మన్ సీ. శ్రీనివాసులు శెట్టి ఈ సందర్భంగా అన్నారు. ఖాతాదారులకు మరింత చేరువయ్యేందుకు ఎప్పటికప్పుడు కొత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ అవార్డు ఖాతాదారుల సేవలకు తమను మరింత కట్టుబడి ఉండేలా చేస్తుందన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల సందర్భంగా ఈ ఏడాది అక్టోబరు 18న అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగే కార్యక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి ఈ అవార్డును అందుకోనున్నారు.

## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు..

## ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర మళ్లీ క్రమంగా పెరుగుతోంది. లక్ష రూపాయలకు దగ్గరల్లో ట్రేడ్ అవుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 19న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 390కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 91, 110కి చేరింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 99, 530కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 260కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 390కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 91, 110కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## మళ్లీ 25,000 దిగువకు నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 501.51 పాయింట్లు క్షీణిం చి 81,757.73 వద్దకు జారుకుంది. నిఫ్టీ 143.05 పాయింట్లు కోల్పోయి నెల రోజుల కనిష్ఠ స్థాయి 24,968.40 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎసఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.458.37 లక్షల కోట్లకు జారుకుంది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి.

## రిలయన్స్ గూటికి కెల్వినేటర్

ముంబై: స్వీడన్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రోలక్స్ గ్రూప్‌నకు చెందిన కన్స్యూమర్ డ్యూరబుల్ ఉత్పత్తుల బ్రాండ్ కెల్వినేటర్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ రిటైల్ శుక్రవారం ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ 18 కోట్ల స్వీడిష్ క్రౌన్లు. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.160 కోట్లు. ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ విభాగమే రిలయన్స్ రిటైల్. దేశంలో అతిపెద్ద రిటైల్ వ్యాపార సంస్థ కూడా. దేశంలో వేగంగా విస్తరిస్తున్న కన్స్యూమర్ డ్యూరబుల్స్ (ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్లు, టీవీలు తదితర ఉత్పత్తులు) మార్కెట్లో రిలయన్స్ తన వ్యాపార వృద్ధిని కదం తొక్కించేందుకు ఈ కొనుగోలు ఒప్పందం దోహదపడనుంది. కాగా,ఎలక్ట్రోలక్స్‌తో లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా రిలయన్స్ రిటైల్ 2019 నుంచే తన రిలయన్స్ డిజటల్ స్టోర్లలో కెల్వినేటర్ ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లను విక్రయిస్తోంది.హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దొడ్ల డెయిరీ.. తూర్పు రాష్ట్రాలలో ప్రీమియం బ్రాండ్‌గా గుర్తింపు పొందిన ఓసామ్ డెయిరీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. రూ.271 కోట్లకు ఓసామ్ డెయిరీలో వంద శాతం వాటాను చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. దేశ తూర్పు ప్రాంతంలో సంస్థ కార్యకలాపాలు విస్తరించేందుకు ఈ కొనుగోలు దోహదపడనుందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలపై బెంట్లే సిస్టమ్స్ దృష్టి



అమెరికాకు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ సంస్థ బెంట్లే సిస్టమ్స్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లపై దృష్టి సారించింది. గడిచిన కొన్నేళ్లుగా ఈ రెండు రాష్ట్రాల్లో రవాణా, అర్బన్ ప్లానింగ్, పారిశ్రామిక, ఇంధన రంగాలు శరవేగంగా వృద్ధి చెందుతూ వస్తున్నాయని, ఈ రంగాలకు అవసరమైన సొల్యూషన్లను అందించటంలో బెంట్లే ఇప్పటికే కీలకంగా ఉందని సంస్థ రీజినల్ ఎగ్జిక్యూటివ్ (దక్షిణాసియా) కమలకన్నన్ తిరువాది తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం రైల్వే, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, విమానాశ్రయ ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారించటంతో తాము కూడా ఈ విభాగాల్లో మరిన్ని అవకాశాలు చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. మరోవైపు తెలంగాణలో కొత్తగా ఇండస్ట్రియల్ జోన్ల ఏర్పాటుతో పాటు మెట్రో రైల్ నెట్‌వర్క్ విస్తరణ, రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుండటం కూడా బెంట్లే సిస్టమ్స్‌కు కలిసి రానుందన్నారు.

## రష్యాపై ఈయూ మరిన్ని ఆంక్షలు



బస్సెల్స్ (బెల్జియం): బ్రిటన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాయి. ఇందులో భాగంగా రష్యా ఎగుమతి చేసే బ్యారల్ చమురు గరిష్ఠ ధరను ప్రస్తుత 60 డాలర్ల నుంచి 45 డాలర్లకు కుదించాయి. ఏ దేశమైనా రష్యా చమురుకు ఇంత కంటే ఎక్కువ చెల్లిస్తే ఆ దేశాలపైనా ఆంక్షలు తప్పవని హెచ్చరించాయి. దీనికి తోడు రష్యా చమురుతో ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ దిగుమతులనూ నిషేధించాయి. దీంతో భారత్‌లో రష్యా చమురు దిగ్గజం రోస్‌నెఫ్ట్ నిర్వహణలోనినయారా ఎనర్జీపైనా ఈ ప్రభావం పడనుంది. మరోవైపు రష్యా బ్యాంకులతో లావాదేవీలపైనా బ్రిటన్, ఈయూ మరిన్ని ఆంక్షలు విధించాయి.

## అమెరికాతో చర్చల్లో జాగ్రత్త



న్యూఢిల్లీ: తాత్కాలిక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుగుతున్న చర్చల్లో భారత్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కోరారు. ఈ చర్చల్లో ముఖ్యంగా వ్యవసాయోత్పత్తుల విషయంలో మన ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా, తెలివిగా వ్యవహరించాలన్నారు. లేకపోతే దేశ ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమెరికాతో సహా అన్ని అభివృద్ధి చెందిన దేశాలు తమ రైతులకు పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ దేశాల నుంచి స్వేచ్ఛగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతిస్తే మన రైతులు రోడ్డున పడే ప్రమాదం ఉందని పరోక్షంగా హెచ్చరించారు. తన వ్యవసాయ, పాల ఉత్పత్తులను కూడా భారత్ జీరో డ్యూటీతో అనుమతించాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాజన్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. నేరుగా ఆ దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను స్వేచ్ఛగా అనుమతించే బదులు..

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006